## డోన్ - ప్యాపిలి జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్ల సమగ్ర పరిశీలన



**డోన్ టౌన్,మే05,(సీమ కిరణం న్యూస్) :** రోడ్డు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో డోన్ జాతీయ రహదారి 44పై అధికారులు విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టారు. ఎంవిఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో డోన్ నుంచి ప్యాపిలి వరకు ఉన్న ప్రమాదకర ప్రాంతాలు (బ్లాక్ స్పాట్లు) గుర్తించి వాటిపై సమగ్ర పరిశీలన నిర్వహించారు.ఈ సందర్భంగా రహదారిపై వాహనాల రాకపోకలు, మలుపులు, వీక్షణ లోపాలు, సిగ్నలింగ్ సమస్యలు, రోడ్డు పరిస్థితులు వంటి అంశాలను అధికారులు నిశితంగా పరిశీలించారు. ప్రమాదాలకు దారితీసే కారణాలను గుర్తించి వాటి నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రోడ్డు మరమ్మతులు చేపట్టడం, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను బలోపేతం చేయడం వంటి సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి, సిఐలు, ఆర్టీసీ నంద్యాల జిల్లా అధికారులు, ఆర్టీసీ డిఎం, ఎస్సైతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రహదారి భద్రతను మెరుగుపరచడం, ప్రమాదాలను గణనీయంగా తగ్గించడం ప్రధాన లక్ష్యంగా ఉంచినట్లు వారు తెలిపారు.అలాగే డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, అధిక వేగంతో వాహనాలు నడపకూడదని, రహదారి భద్రతపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలకు సూచించారు.

## విజ్జీ స్టేడియంలో టి-20 టోర్నమెంట్ ప్రారంభం



**విజయనగరం ప్రతినిది మే 5 (సీమ కిరణం న్యూస్):**విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో 52 జట్లతో 'సర్ విజ్జీ టి-20 క్రికెట్ టోర్నమెంట్' మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి ప్రారంభించారు. పూసపాటి విజయానంద గజపతి రాజు స్ఫూర్తితో ఈ కార్యక్రమం చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అన్ని జట్లు ఉత్తమంగా ఆడాలని ఆమె ఆకాంక్షించారు.

## ప్రజా భాగస్వామ్యంతో మంచి ర్యాంక్‌కు కృషి చేయాలి




**విజయనగరం ప్రతినిది మే (సీమ కిరణం న్యూస్):** న్యూస్:ప్రజలందరి భాగస్వామ్యంతో స్వచ్ఛ సర్వేక్షన్‌లో మంచి ర్యాంక్‌కు కృషి చేయాలని విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ బాలా స్వామి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో త్వరలో జరగనున్న స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే కోసం అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో చర్చించారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండి సర్వేకు సహకరించాలని సూచించారు.ఎక్కువ ప్రజాభిప్రాయాన్ని నమోదు చేసి జాతీయ స్థాయిలో నగరాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి

**విజయనగరం ప్రతినిది మే 5 (సీమ కిరణం న్యూస్):** ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు కోరారు. బొబ్బిలి మున్సిపాలిటీలోని గెస్ట్ హౌస్ కాలనీలో మంగళవారం ఇంటింటికి వెళ్లి ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.ఆరుగురు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు అడ్మిషన్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు.



## ఆలయాల పునరుద్ధరణకు భారీగా నిధులు మంజూరు!



**పామిడి, మే 5 (సీమ కిరణం న్యూస్):** పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయం, బెస్తవీధిలోని గంగమ్మ దేవాలయం పునరుద్ధరణ పనులకు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నిధులు మంజూరు చేయించినట్లు టీడీపీ మండల ఇన్చార్జి గుమ్మనూరు ఈశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధికి సర్వశ్రేయో నిధులు కింద లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి రూ.2కోట్లు, గంగమ్మ దేవా లయానికి రూ.60లక్షలు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. ఆలయాల పునరుద్ధరణకు నిధులు మంజూరుపై భక్తులు హర్షం వ్యక్తంచేశారు.

# డోన్‌లో చల్లివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే కోట్ల







**డోన్ టౌన్, మే 05,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం చల్లివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. డోన్ పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాఘవేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చల్లివేంద్రాన్ని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి చల్లివేంద్రాల ఏర్పాటు వారికి ఎంతో ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. చల్లివేంద్రం ద్వారా ప్రయాణికులు, దినసరి కార్మికులు, స్థానిక ప్రజలకు చల్లటి తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సామాజిక సేవకు మంచి ఉదాహరణగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు

# గ్రామీణ అభివృద్ధికి డిజిటల్ సేవలను మరో ముందడుగు బుక్ కీపర్లకు 5G స్మార్ట్‌ఫోన్ల పంపిణీ





**డోన్ టౌన్, మే 05,(సీమ కిరణం న్యూస్):**గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవలను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా,మంగళవారం డోన్ పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ ( వివో ఏ ఎస్) బుక్ కీపర్లకు 5+ స్మార్ట్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్‌ఫోన్లను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ అభివృద్ధిలో డిజిటల్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలను గ్రామస్థాయిలో వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు ఈ తరహా సాంకేతిక వనరులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. 5+ సాంకేతికతతో కూడిన ఈ స్మార్ట్‌ఫోన్లు బుక్ కీపర్ల పనితీరును మరింత సమర్థవంతంగా మార్చి, డేటా నిర్వహణలో వేగం మరియు ఖచ్చితత్వాన్ని పెంచుతాయని అన్నారు. స్వయం సహాయక సంఘాల ( ఎస్ హెచ్ జి ఎస్) కార్యకలాపాల్లో బుక్ కీపర్ల పాత్ర అత్యంత ముఖ్యమని, సభ్యుల వివరాలు నమోదు చేయడం, లావాదేవీల పర్యవేక్షణ, ఖాతాల నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు వంటి బాధ్యతలను వారు సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో పనులు డిజిటల్ విధానంలో నిర్వహించబడటంతో సేవల నాణ్యత పెరగడంతో పాటు ప్రజలకు లభించే ప్రయోజనాలు సమయానికి చేరుతాయని వివరించారు. మహిళా సాధికారత రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య అంశమని, స్వయం సహాయక సంఘాల బలోపేతం ద్వారా గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్లు మహిళల్లో డిజిటల్ అవగాహన పెంచడంతో పాటు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలను సులభంగావినియోగించుకోవడంలో మరియు స్వయం ఉపాధి అవకాశాలను అన్వేషించడంలో




ఉపయోగపడతాయని అన్నారు. అదేవిధంగా, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా బుక్ కీపర్లు కీలక బాధ్యత వహిస్తున్నారని, వారు తమ విధులను నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా అన్ని లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించి, ఖచ్చితమైన నమోదు ప్రక్రియను పాటించాలని హితవు పలికారు.ఇంకా "ఒన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్" లక్ష్యంతో ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు, యువత వ్యాపార అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు మరియు బుక్ కీపర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనలు గాలికి... అడ్మిషన్ల వేటలో ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు!

### చూసి చూడనట్లు

### వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు

**పెద్దకడబూరు ఏప్రిల్ 5(సీమ కిరణం న్యూస్):** విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై పెద్దకడబూరు కస్తూరిబాయ్ స్కూల్ నందు ఆన్లైన్లో రిజల్ట్ వచ్చినా కూడా సరైన సమయంలో తల్లిదండ్రులకు ఇన్ఫర్మేషన్ ఇవ్వకుండా స్కూలుకు రిజల్ట్ పేపర్ అతికించకుండగా ఉన్నటువంటి కస్తూరిబాయ్ ప్రిన్సిపల్ పైన చర్యలు తీసుకోవాలని తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళన చేపడుతాం అని హెచ్చరించారు ఏఐఎస్ఎఫ్ మండలంలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విచ్చలవిడిగా కటౌట్లు పెట్టిన ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల పాఠశాలలకు వ్యతిరేకంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.ఈరేష్ మాట్లాడుతూ ప్రభుత్వా నియమా నిబంధనలు తుంగలో తొక్కి జీవో నెంబర్ 1 కి వ్యతిరేకంగా ప్రభుత్వం నుంచి గాని ప్రభుత్వ అధికారుల నుంచి గాని ఎలాంటి అనుమతి లేకుండా మండలంలో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యం ఇష్టానుసారంగా ప్రచారాలు నిర్వహిస్తూ ముందస్తు అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు అదేవిధంగా కొన్ని




పాఠశాలల్లో అర్హత లేని ఉపాధ్యాయులను పెట్టుకుని విద్యను బోధిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా చూసి చూడనట్లు ఉండడం సిగ్గుచేటు అన్నారు ఇప్పటికైనా మండల విద్యాశాఖ అధికారులు , ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి జీవో నెంబర్ 1కి వ్యతిరేకంగా ప్రచారాలు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దస్తగిరి,అఖిల్,వర్మ పాల్గొన్నారు.

